

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.4 । కనిష్ఠం 26.8



నేడు గంగాస్థాన్ ఫేస్-2లో విద్యుత్ సరఫరాకు అంతరాయం


సుభాష్‌నగర్, మే 19: నగరంలోని గంగాస్థాన్ ఫేస్-2 పరిధిలో విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడనున్నట్లు నగర టౌన్-2 ఏడీ తోట రాజశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. గంగాస్థాన్ ఫేస్-2 పరిధిలోని 6 అపార్ట్‌మెంట్ మున్సిపల్ కార్పొరేషన్ డ్రైనేజీ నిర్మాణంలో అడ్డు వస్తున్న 11 కెవి, ఎల్‌టి లైన్‌లను పక్కకు మార్చడం కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానిక వినియోగదారులు సహకరించాలని కోరారు.





- ప్రభుత్వానికి వివరాలు పంపించిన జిల్లా అధికారులు
- పదవీకాలం పూర్తవుతున్న మండల పరిషత్, జడ్పీపైన దృష్టి
- ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా జరుగనున్న ఎన్నికలు
- ఈ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్న అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు



నిజామాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ, ఎన్నికల కోసం యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే జిల్లాలోని గ్రామ పంచాయతీల వివరాలను పంపించారు. ఏఏ గ్రామ పంచాయతీల్లో ఎవరు పదవుల్లో కొనసాగారు, ఏ రిజర్వేషన్లకు అనుగుణంగా వారు పదవీకాలంను పూర్తి చేశారు, ఎవరెవరు పదవుల్లో ఉన్నారు, జడ్పీలో ఎవరున్నారు వంటి అంశాలను రిజర్వేషన్ల ఆధారంగా పంపించారు. జిల్లాలో ఈ పంచాయతీలతో పాటు జూలైలో పదవీకాలం పూర్తవుతున్న జడ్పీ, మండల పరిషత్‌ల వివరాలను అందించారు. కొత్తగా ఏర్పడిన మండలాల వివరాలను కూడా పంపించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనుండటంతో ముందస్తుగా ఈ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. జడ్పీ, మండల పరిషత్‌ల పదవీకాలం జూలై వరకు ఉండనుండటంతో రెండింటిని ఒకేసారి నిర్వహించిన, వేర్వేరుగా ఎన్నికలు జరిపినా పూర్తి చేసేందుకు అధికారులు ఈ ఏర్పాట్లను చేస్తున్నారు.

పంచాయతీల్లో కొనసాగుతున్న ప్రత్యేకాధికారుల పాలన

జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొన్ని మేజర్ గ్రామ పంచాయతీలు ఉండగా మరికొన్ని తండా పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 2తో ముగిసింది. అప్పటి నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. శాసనసభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడం ఏర్పడిన కొత్త ప్రభుత్వం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను నిర్వహించేందుకు సుముఖత లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనను పెట్టారు. ఆ అధికారుల ఆధ్వర్యంలోనే ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 5300 వరకు వార్డులు ఉన్నాయి. వీటికి ప్రత్యక్షంగా ఎన్నికలను నిర్వహించనున్నారు. ఒక సర్పంచ్‌కు మాత్రం పరోక్ష విధానంలో ఎన్నికలు జరుపనున్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తై నాలుగు నెలలు అవుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ఎన్నికలపై దృష్టి పెట్టింది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ప్రకటించి కోడ్ ముగిసిన తర్వాత ఈ ఎన్నికలపైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు కసరత్తు చేస్తుండటంతో జిల్లాల వారీగా అధికారులు వివరాలను సేకరించారు. జిల్లా నుంచి కూడా పంచాయతీ అధికారులు పూర్తి వివరాలను పంపించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఏఏ రిజర్వేషన్లు అమలు చేశారు, ఎవరెవరు ఆ రిజర్వేషన్ల ప్రకారం పదవీకాలం పూర్తి చేశారు, గ్రామ సర్పంచ్‌ల నుంచి వార్డు సభ్యుల వరకు రిజర్వేషన్ల వివరాలను పంపించారు. జిల్లాలో మొత్తం వార్డుల వివరాలతో పాటు పూర్తి రిజర్వేషన్ల జాబితాను అధికారులకు పంపించారు. గ్రామ పంచాయతీలే కాకుండా మండల పరిషత్, జడ్పీకి సంబంధించిన వివరాలను అందించారు. మండల పరిషత్‌లో ఎంపీటీసీలు, జిల్లా పరిషత్‌లో జడ్పీటీసీల వివరాలను, రిజర్వేషన్లను క్రోడీకరించి నివేదిక రూపంలో పంపించారు. మండల పరిషత్, జడ్పీ సభ్యుల పదవీకాలం వచ్చే జూలై మొదటి వారం వరకు ఉండటంతో వాటికి కూడా ఎన్నికలను నిర్వహించనున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికలను నిర్వహిస్తోంది. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంతో పాటు డివిజన్ల వారీగా ఈ ఎన్నికలను నిర్వహిస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పార్టీల రహితంగా జరుగనుండగా ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలు మాత్రం పార్టీ గుర్తులపైనే జరుగనున్నాయి. ఈ వివరాలను జిల్లా పంచాయతీ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఎన్నికలకు అవసరమైన ఇతర వివరాలను కూడా సేకరిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే బ్యాలెట్ ద్వారా ఈ ఎన్నికలు నిర్వహించనుండటంతో బ్యాలెట్ పెట్టెలతో పాటు ఇతర వివరాలను కూడా రాష్ట్ర అధికారులకు నివేదించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా మొదట గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన తర్వాత మండల పరిషత్, జడ్పీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అనుకూలిస్తే రెండింటిని కూడా ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీలో పాలకవర్గం లేకపోవడం వల్ల ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామాల్లో సర్పంచులతో పాటు వార్డు సభ్యులు ఉంటే పనులు సజావుగా జరగడంతో పాటు ప్రజలకు మెరుగైన పాలన అందనుంది. కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా పాలకవర్గం ఉంటేనే గ్రామ పంచాయతీలకు రానున్నాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగానే గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్, జడ్పీ ఎన్నికలు జరుగనున్నాయి.

పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

ఈ గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జడ్పీ ఎన్నికలపై ప్రధాన పార్టీల గ్రామ, మండల స్థాయి నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటి వరకు పదవులు అనుభవించిన వారితో పాటు కొత్తగా పోటీ పడే వారు కూడా ముందస్తుగా ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఎలాగైనా గ్రామాలకు, మండల పరిషత్‌లకు, జడ్పీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో కొన్ని గ్రామాల పరిధిలో ఇప్పటి నుంచే కొంత మంది నేతలు పలు రకాల పనులను చేస్తున్నారు. గ్రామస్థులను ఆకట్టుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించనున్న ఈ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా ఎక్కువ మొత్తంలో ఆశలు పెట్టుకున్నారు. పదేళ్లుగా పదవులకు దూరంగా ఉన్న ఆ పార్టీ నేతలు ఈ దఫా ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ పడేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉండటం వల్ల తమకు అనుకూలిస్తుందని భావిస్తున్నారు. గ్రామ, మండల స్థాయి ఎన్నికలపైన దృష్టి పెట్టి పని చేస్తున్నారు. ప్రభుత్వం పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించిన లేదా కొత్తగా రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలను పెట్టిన పోటీ పడేందుకు ఆ పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. వారితో పాటు బీఆర్ఎస్, బీజేపీ నేతలు కూడా ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్న అధికార పార్టీ నేతలకు మాత్రం ఈ మధ్యన చేరిన నేతల నుంచి పోటీ ఎదురవుతోంది. పదేళ్ల పార్టీ కోసం పని చేసిన నేతలు మాత్రం ఎలాగైనా పోటీ పడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా జరిగే ఈ ఎన్నికల్లో గ్రామ పంచాయతీలో మాత్రం గట్టి పోటీ కనిపించే అవకాశం ఉంది.

అసంపూర్తి నిర్మాణాలుగా అబ్కారీ భవనాలు

- నిధులు లేక ఆగిన నిర్మాణాలు
- మూడేళ్లుగా కొనసాగుతున్న పనులు
- నిధులు వచ్చేనా.. భవనాలు పూర్తయ్యేనా?

సుభాష్‌నగర్, మే 19: రాష్ట్ర ఖజానాను నింపే అబ్కారీ శాఖకు అద్దె భవనాలే దిక్కయ్యాయి. నిర్మాణాలు చేసినా అసంపూర్తిగా వదిలేయడంతో అద్దె భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అద్దె చెల్లింపులు ఎక్కువవడంతో ప్రభుత్వం ఎక్సైజ్ కార్యాలయాలకు వివిధ ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో స్థలాలు కేటాయించి భవనాలను నిర్మించడానికి ప్రణాళికలు చేసింది. గత రెండు మూడు సంవత్సరాల క్రితం నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్ స్టేషన్లకు స్థలాలను కేటాయించి నిర్మాణాలను చేపట్టింది. నిర్మాణాలకు బడ్జెట్‌ను కేటాయించి పనులను మొదలు పెట్టింది. నిర్మాణాలు గత రెండు మూడు సంవత్సరాలుగా నత్తనడకగా సాగుతున్నాయి. బడ్జెట్‌ను కేటాయించకపోవడంతో భవన నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. బడ్జెట్ కేటాయింపుల కోసం ఎక్సైజ్ అధికారులు వేచి చూస్తున్నా బడ్జెట్ మాత్రం కేటాయించడం లేదు. భవన నిర్మాణాలన్నీ చివరి దశలో ఉన్నాయి. కొంతమేర బడ్జెట్‌ను కేటాయిస్తే సొంత భవనాల్లో కార్యాలయాలను నెలకొల్పే అవకాశం ఉంటుంది. చివరి దశకు చేరుకుని కూడా సంవత్సరంపైగా గడుస్తున్నా నిర్మాణాలు మాత్రం చేపట్టడం లేదు. ఆధునిక హంగులతో నిర్మిస్తున్న ఎక్సైజ్ శాఖ ఎస్‌హెచ్‌వో కార్యాలయాలు చివరి నిర్మాణాలు చేపట్టి పూర్తిచేస్తే ఎక్సైజ్ శాఖకు అద్దె కట్టే భారం తప్పుతోంది. మోర్తాడ్, భీమ్‌గల్ ఎస్‌హెచ్‌వో కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

అద్దె భవనాల్లోనే ఎక్సైజ్ కార్యాలయాలు

జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ కార్యాలయాలు దాదాపుగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నిజామాబాద్ డీసీ కార్యాలయం, ఈఎస్ కార్యాలయం, ఎస్‌హెచ్‌వో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్, మోర్తాడ్, భీమ్‌గల్ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి అద్దె కోసం లక్షల్లో వెచ్చిస్తున్నారు. నెలకు లక్షల్లో డబ్బులు అద్దె కోసం చెల్లిస్తుండడంతో ఆబ్కారి శాఖకు గండి పడుతోంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఎక్సైజ్‌శాఖ కూడా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే అద్దెభారం తప్పనుంది. మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్‌కు స్థలాలు కేటాయించి నిర్మాణాలు చేపట్టినా నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో కార్యాలయానికి ఇప్పటికీ కనీసం స్థలాన్ని కూడా కేటాయించలేదు. జిల్లా కేంద్రంలోని నాగారంలో స్థలాన్ని కేటాయించారని చెబుతున్నా అక్కడ స్థలం ఉందో లేదో తెలియని పరిస్థితి ఉంది. అడిషనల్ కమిషనర్ భవనం కూడా ప్రభుత్వ ఉద్యానవనశాఖ కార్యాలయం ఖాళీ చేయడంతో తాత్కాలికంగా అక్కడ కొనసాగుతోంది. దాదాపు కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతుండడంతో అబ్కారీ శాఖకు లక్షల్లో గండిపడుతోంది.

సొంత నిధులతో పూర్తిచేసే పనిలో అధికారులు

అబ్కారీ శాఖ భవనాలకు ప్రభుత్వం నిధులు ఇచ్చేట్టు ఇప్పట్లో కనబడడం లేదు. గత రెండు నుంచి మూడు సంవత్సరాలుగా నిధులు లేకపోవడంతో భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. అబ్కారీ శాఖ అధికారులు కిందిస్థాయి నుంచి మొదలుకొని పైస్థాయి వరకు కొంతమేర నిధులు సమీకరించి భవనాలను పూర్తిచేసుకునే పనిలో పడ్డారు. దీనికోసం కిందిస్థాయి అధికారుల నుంచి పైస్థాయి అధికారి వరకు నిధులు సమీకరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా తమ సొంత నిధులతో పనులు చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. గత సంవత్సరకాలంగా ప్రభుత్వానికి నివేదికలు పంపినా నిధులు విడుదల చేయకపోవడంతో సొంతంగా పనులు పూర్తిచేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇకపై టీఎస్ బదులు టీజీ

నిజామాబాద్ అర్బన్, మే 19: తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులు టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లలో తెలంగాణ సంక్షిప్త పదం టీజీగా పేర్కొనాలని సూచించిందన్నారు. ఈ మేరకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిందని తెలిపారు. గత మార్చి నెలలోనే వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అనుమతులు రాగా తాజాగా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీఎస్‌కు బదులు టీజీగా వ్యవహరించేందుకు అనుమతిచ్చిందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్వయం ప్రతిపత్తి కలిగిన విభాగాలన్నీ విధిగా పాటించాలని ఆదేశించారు. లెటర్ హెడ్‌లు, రిపోర్టులు, నోటిఫికేషన్‌లు, అధికారిక వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్, పాలసీ పేపర్లు, ఇతర అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని సూచించారు. తక్షణమే అమల్లోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో టీఎస్‌కు బదులు టీజీగా మారుస్తూ ఈనెల 26వ తేదీలోగా నివేదికలు సమర్పించాలని ఆయా శాఖల అధికారులను కోరారు.

టమాట ధర.. ఢమాల్

- ధర లేక టమాట రైతులకు నష్టాలు
- పంటను పొలాల్లోనే పారవేస్తున్న రైతులు

ఆర్మూర్ రూరల్, మే 19: టమాట కూరగాయల్లో అధికంగా వినియోగిస్తుంటారు. టమాట ధర తగ్గిన పెరిగిన దాని ప్రత్యేకతే వేరు. టమాటకు నిత్యం ఆదరణ ఉన్న ప్రస్తుతం ధర పలకకపోవడం రైతులు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం టమాట పెట్టే (రూ.25కిలోల టమాట)లు కేవలం వంద రూపాయాలు మాత్రమే పలుకుతోంది. ఇలాంటి పరిస్థితిల్లో కూలీల ఖర్చు కూడా గిట్టుబాటు కావడం లేదు. దీంతో కొందరు రైతులు టమాటలను తెంచకుండా చెట్లపైకి వదిలేస్తుండగా మరికొందరు పొలాల్లోనే పారవేస్తున్నారు. మార్చి నెల నుంచి జున్ నెల వరకు మంచి ధర పలుకుతోంది. కానీ ఈ సారి ధర ఆశాజనకంగా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం వేసవి కాలంలో మార్కెట్‌లో కిలో టమాట రూ.200లకు వరకు అమ్ముడుపోయింది. రైతులకు పెట్టే(25కిలోల) రూ.800నుంచి రూ.1500వరకు పలికింది. చివర్లో ఈ ధర మరింత పెరిగి రూ.2వేల వరకు రావడంతో రైతులు అధిక లాభాలు అర్జించారు.

కూరగాయల్లో అధిక వినియోగం

టమాటాలను కూరగాయల్లో అధికంగా వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో టమాటాలు ఏ కాలంలోనైనా లభిస్తాయి. నిత్యం పంట ఏడాది పొడుగునా సాగు చేస్తారు. శీతాకాలంలో సాగు చేస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

మార్కెట్‌లో ధర హెచ్చు తగ్గులను గమనిస్తూ టమాట పంటను రైతులు పలు దఫాలుగా సాగు చేస్తున్నారు. ధర తగ్గినా పెరిగినా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైన ఒక సీజన్‌లో రాకపోతే మరో సీజన్‌లోనైన టమాట పంట సిరులు కురిపిస్తోందని నమ్మకంతో రైతులు పంటను సాగు చేస్తున్నారు. డ్రిప్, స్టేకింగ్ పద్ధతిలో సాగు చేస్తూ ఎకరానికి గరిష్టంగా 25 నుంచి 30 టన్నులు పంట దిగుబడిని సాధిస్తున్నారు.

టమాట ఆధారిత పరిశ్రమలేవీ?

ప్రభుత్వాలు రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర లభించడానికి చొరవ తీసుకున్న దాఖలాలు లేవు. ఆర్మూర్ ప్రాంతంలో సుమారు రెండు వేల ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తుంటారు. ఇందులో టమాట ప్రధాన పంట టమాట ధర పడిపోయిన సమయంలో రైతులకు నష్టాలు రాకుండా టమాట ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తే రైతులకు మేలు జరుగుతోంది. టమాట కచాప్(సాసు) జామ్‌ల తయారీలో ఎక్కువగా వాడుతుంటారు. ఇందుకు సంబధించిన పరిశ్రమలకు ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందిస్తే టమాటను రోడ్డుపై పారేసే పరిస్థితి రాకుండా ఉంటుంది. రైతులకు ధర స్థిరంగా ఉండి గిట్టుబాటు అవుతోంది.





టమాటకు ధర రాక పొలాల్లోనే పారేసిన దృశ్యం



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టమాట



అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెండోర, మే19: మండలంలో పోచంపాడ్ తెలంగాణ రాష్ట్ర బాలికల, గురుకుల పాఠశాల, కళాశాల పోచంపాడ ఎక్స్‌రోడ్డులో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఎంపీసీ, బైపీసీలో ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు విద్యార్హతలు అనుభవం కలిగి అతిథి ఉపాధ్యాయులు విద్యార్హతలు అనుభవ సర్టిఫికెట్లు జతచేసి 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతికశాస్త్రం, రసాయనిక శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం సబ్జెక్టుల్లో డిగ్రీ పోస్టు గ్రాడ్యుయేషన్ బీఎడ్‌లో సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులని మరిన్ని వివరాలకు 9701222079నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెంజల్,మే19: రెంజల్ మండలం కందకుర్తి గోదావరి నదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు రెంజల్ ఎస్ఐ సాయన్న తెలిపారు. మృతుడి వయసు దాదాపు 45నుంచి 55సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే రెంజల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు









యూనిఫాంల బాధ్యత ఐక్య సంఘాలదే

- విద్యార్థుల వివరాలు సేకరించిన మహిళ సంఘాల సభ్యులు
- పాఠశాల పునఃప్రారంభం నాటికి దుస్తులు సిద్ధం

డొంకేశ్వర్,మే19: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలను అందించే బాధ్యత ప్రభుత్వం స్వయం సహాయక సంఘా లకు అప్పగించింది. పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేలా విద్యాశాఖ అధికారులు, ప్రణాళికలు రూపొందించారు. ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించనున్నారు.

● విద్యార్థుల కొలతలు సేకరణ

డొంకేశ్వర మండలం పరిధిలో 19పాఠశాలల్లో బాలురు 756, బాలికలు 659 ఉన్నారు. మొత్తం 1415మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున 2830 దుస్తుల తయారీకి అధికారులు అంచనా వేశారు.వారికి జూన్12న పాఠశాల పునః ప్రారంభం అవు తుంది. పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లను అందించాలని నిర్ణయించారు. దీంతో విద్యార్థుల చదువుకు అటంకం కలుగకుండా ఉంటుందని ఉన్నతాధికా రులు బావిస్తున్నారు. ఈ విద్య సంవత్సరం పూర్తి కాక ముందు మహిళా సంఘాలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వివరాలు నమోదు చేసుకున్నారు. మహిళ సంఘాలలో సభ్యురాలు అయి ఉండి సంఘం ద్వారా రుణం తీసుకొని స్టిచ్చింగ్‌పై ఉపాధి పొందుతున్న మహిళలకు గుర్తించి ఐకెపి ద్వారా విద్యార్థులకు దుస్తులను సిద్ధం చేసేందుకు గాను అధికారులు చర్యలను చేపట్టారు. పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు దుస్తులు అందించేందుకు గాను పనులను వేగవంతం చేశారు. గ్రామాల్లో ఉపాధి లేకుండా ఉండి స్టిచ్చింగ్‌పై ఆధారపడి పని చేస్తున్నా వారిని గుర్తించి గ్రూపులుగా ఏర్పాటు చేసి మహిళా సంఘాల ద్వారా ఉపాధి కల్పిస్తున్నారు.



డొంకేశ్వర్‌లో విద్యార్థుల యూనిఫాం కొలతలు తీసుకుంటున్న మహిళా సంఘ సభ్యులు

విద్యార్థుల కొలతలను సేకరించి స్టిచ్చింగ్ పనులను మొదలు పెట్టానున్నారు. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు స్వయం ఉపాధి పొందేందుకు తోడ్పడుతుంది. స్టిచ్చింగ్ చేస్తూ వచ్చే డబ్బుతో కుటుంఆన్ని తోడుగా ఉంటుంది.

● ఒక్కో జతకు రూ.50

విద్యార్థులకు ప్రతీ ఏటా రెండు జతల యూనిఫాంలను అందిస్తున్నారు. ఒక్కో జతకు రూ.50చొప్పున రెండు జతలకు రూ.100 మహిళా సంఘానికి అందిస్తారు. ప్రభుత్వం అందించే కుట్టుకూలీ చార్జీలు సరిపోవని గ్రామ ఐక్య సంఘాలు పేర్కొంటున్నాయి. దీంతో కొంత మంది ఆసక్తి చూపడంలేదు. గత ఏడాది వరకు పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను అందించే బాధ్యతను హెచ్ఎంలకు అప్పగించే వారు. పాఠశాల నిధులతో పాటు ఈపనులు భారం కావడంతో యూనిఫాంల బాధ్యత గ్రామ ఐక్యసంఘాలకుఅప్పగించారు.సంఘాలలో ఉన్న సభ్యులకు చేయడానికి పనులు అప్పగిం చారు.

అవగాహన కల్పిస్తున్నాం

స్టిచ్చింగ్ చేసి మహిళలకు ఒక్క జతకు రూ.50 చెల్లిస్తున్నారు. అవి సరిపోవడంలేదని వారు అంటున్నారు. మహిళ సంఘాలకు ఇవ్వడం ప్రభుత్వం మొదటి సారి కాబట్టి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న సంఘాలు విద్యార్థులకు సకాలంలో యూని ఫాంలు అందించేలా స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పిస్తున్నాం. సభ్యులు పాఠశాలలకు క్షేత్రస్థాయిలో వెళ్ళి వివరాలు నమోదు చేశారు.

- మాణిక్యం, ఏపీఎం

అంతర్జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు పెర్కిట్‌వాసి

ఆర్మూర్‌రూరల్, మే19: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్ పీఈటీ అఖిల్ శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషల్ టెన్నిస్ బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శ్రీలంకలో జరిగిన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అఖిల్ భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచేందుకు తనవంతు కృషి చేశాడని కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి తెలిపారు. భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన అఖిల్‌ను పలువురు అభినందించారు.





కమ్మర్‌పల్లిలో ప్రభుత్వ కళాశాల ప్రవేశాలు ప్రారంభం



అడ్మిషన్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు

కమ్మర్‌పల్లి, మే 19: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థుల అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ చిరంజీవి తెలిపారు. ఈ మెరకు మండలపరిధి గ్రామాలులో గతమూడు రోజులగా అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తు నేరుగా అడ్మిషన్‌లు తీసుకుంటున్నట్లు తెలిపారు., ఈ ఏడాది కళాశాలలో అన్ని గ్రూప్‌లకు కలిపి సుమారు 150 నుంచి 2వందలవరకు అడ్మిషన్‌లు చేయాలని లక్ష్యంగా అడ్మిషన్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కమ్మర్‌పల్లి మండల పరిధి గ్రామాలతో పాటు చుట్టుపక్కలా వివిధ మండలాలకు చెందిన గ్రామస్థులు కమ్మర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని గ్రూప్‌లకు సంబంధించి అడ్మిషన్‌లు చేయించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరు తమ కళాలాలో అడ్మిషన్ తీసుకోవాలన్నారు. జనరల్ కోర్సులైన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ ఈసీ తెలుగు, ఇంగ్లీస్ మీడియంలలో ప్రవేశాలు జరుగుతున్నాయని విద్యార్థులు పదోతరగతి ఇంటర్నెట్ పాస్ మెమో,మూడు పాస్‌పోట్ సెజ్ ఫోటోలు, అధార్ జిరాక్స్ కాపీలతో కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలోగల కళాశాలలో అడ్మిషన్‌లు పొందాలని సూచించారు.

జీపీ వాహనాలకు నిర్వహణ భారం

- కిస్తులు చెల్లించేందుకు కార్యదర్శుల సతమతం
- సీజ్‌చేస్తామని బ్యాంకు అధికారుల ఒత్తిడి



గ్రామ పంచాయతీ ట్రాక్టర్

మద్నూర్, మే 19: గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ట్రాలీ నిర్వహణ భారంగా మారింది. వాటి నెలవారి కిస్తులు చెల్లించేందుకు కార్యదర్శులు సతమతం అవుతున్నారు. డబ్బులు లేక నానాయాతన పడుతున్నారు.

● కొత్త చట్టం మేరకు

1994లో తీసుకుని వచ్చిన పంచాయతీ రాజ్ చట్టంలో బాధ్యతలు, విధులు సరిగ్గా లేవని, అసంపూర్తిగా ఉందని, దానిని గత ప్రభుత్వం రద్దు చేసి 2018లో కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని అమలులోకి తీసుకుని వచ్చింది. కొత్త చట్టంలో మన ఊరు - మన ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు, మొక్కల పరిరక్షణ, డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించి, ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలను గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం నుంచి సరిచేసుకోవాలని, వాయిదాల పద్ధతిలో చెల్లించేలా వాహనాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

● ట్రాక్టర్లకు రెగ్యులర్ డ్రైవర్లు లేరు

వాహనాలకొనుగోలుకు ఉత్తర్వులు ఇచ్చారు కానీ ప్రభుత్వం డ్రైవర్ల నియామకంపై ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో మల్టీపర్పస్ నెట్టుకుని వస్తున్నారు. దీంతో అర్హత లేని డ్రైవర్లతో కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. వాహనాలు మరమ్మతులకు గురికావడమే కాకుండా ప్రమాదాలకు గురై పోలీస్ కేసుల వరకు వెళ్లిన సందర్భాలున్నాయి. కార్యదర్శులను బాధ్యులు చేస్తూ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. మల్టీ పర్పస్ వర్కర్లలో విద్యార్హత లేక లైసెన్సు లేని డ్రైవర్లతో వాహనాలను నడిపిస్తూ చెత్త సేకరణ చేస్తున్నారు. దీంతో వాహనం మరమ్మతులకు గురికావాల్సి వస్తుంది. గత ఐదు నెలల నుంచి సిబ్బందికి వేతనాలు లేకపోవడంతో కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. జనవరి నెలలో ప్రభుత్వం నిధులు విడుదల చేయగా, ఫిబ్రవరి నుంచి ఈ నెల వరకు నిధులు లేకపోవడంతో జీపీ ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు వాహనాల నిర్వహణ భారం తగ్గించడానికి నిధులు విడుదల చేయాలని గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఫిబ్రవరి నెల నుంచి ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామ పంచాయతీలకు లాభాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామాల్లో పడకేసిన ప్రత్యేకాధికారుల పాలన

● గ్రామ పంచాయతీల్లో ఖజానా ఖాళీ ● గ్రామాల్లో పనుల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు, పారిశుద్ధ్యం అస్తవ్యస్థం ● సిబ్బంది వేతనాల చెల్లింపులకూ ఇబ్బంది



జాగిర్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

భీమ్‌గల్‌రూరల్, మే19: ఈ ఏడాది జనవరి నెలాకరుకు సర్పంచ్‌లు, పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. గ్రామాల్లో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే ప్రత్యేక అధికారులు మాత్రం గ్రామ పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదో మొక్కుబడిగా వారానికి, పదిరోజులు గ్రామపంచాయతీ కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీల్లో ఏమైనా అత్యవసర పనులు వుంటే కార్యదర్శుల పైనే ప్రత్యేక అధికారులు భారం మోపుతున్నారు. నిధుల వినియోగానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రత్యేక అధికారులకు చెక్‌పవర్ ఇచ్చారు. అయితే నిధుల లేమితో ప్రత్యేక అధికారులు ఏమి చేయలేనటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పైనే పూర్తిస్థాయి బాధ్యతలు పడుతున్నాయి. గ్రామాల్లో పనుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

● గ్రామాల్లో చేయాల్సిన పనులివే..

గ్రామ పంచాయతీల ఖజానా ఖాళీ అయ్యింది. నిధుల లేమితో గ్రామాల్లో అత్యవసరంగా చేయాల్సిన పనులు కూడా కుంటుబడుతున్నాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చేపట్టాల్సిన పనులకు పైసలు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. గ్రామాలలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. డ్రైనేజీలో పూడికి తీత పనులు, చేతి పంపుల రిపేర్లు చేయాల్సి ఉంది. గ్రామాలలోని వీధిలైట్లు, బ్లీచింగ్ కొనుగోలు చేసేందుకు నిధుల కొరత ఏర్పడింది. గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీ పర్పస్ వర్కర్లకు నెలనెలా వేతనాలు ఇచ్చేందుకు కూడా కొన్ని గ్రామపంచాయతీల్లో కటకట వుంది. చెత్తను సేకరించే ట్రాక్టర్లకు డీజీల్, మెయింటెనెన్స్‌కు కూడా ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితులు గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఆర్థికభారం మోపుతున్నాయి. జనవరి నెలలో కేంద్రం నుంచి 15 వ ఆర్థిక సంఘం నిధులు కొద్దిమేరా గ్రామపంచాయతీ ఖాతాలో జమఅయ్యాయి. ఈ నిధులతోనే గ్రామపంచాయతీ కార్యదర్శులు గత ఐదు నెలలుగా నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల కాలేదు. గతంలో సర్పంచ్‌లు చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించాల్సి వుంది. గ్రామాల్లో చెత్తసేకరణకు, మొక్కలకు నీరు పట్టించేందుకు కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రక్కు, ట్యాంకర్లకు సంభంధించి తీసుకున్న ఫైనాన్స్ కిస్తీలను కూడా కొన్ని గ్రామపంచాయతీలు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నాయి. గతంలో గ్రామాలలో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించిన కాంట్రాక్టర్లు కూడా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. భీమ్‌గల్ మండలంలో 27 గ్రామ పంచాయతీల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొంది. పారిశుధ్యం పడకేసింది. ముఖ్యంగా గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పడడంతో గిరిజన తండాల్లోని గ్రామపంచాయతీ పరిస్థితి మరీ దారుణంగా మారింది.

గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వుంది



గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియండంతో కార్యదర్శులతో పాటు సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. నిధుల కొరత వుంది. పారిశుద్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము.

- సంతోష్ కుమార్, ఎంపీడీవో, భీమ్‌గల్

చిన్నవాల్గోట్‌లో ఊరపోచమ్మకు బోనాలు


చిన్నావాల్గోట్‌లో బోనాలెత్తిన గ్రామస్తులు

సిరికొండ, మే 19: గ్రామంలో నూతన విగ్రహాలను ప్రతిష్ఠించడంతో గ్రామస్థులు ఊరపోచమ్మకు బోనాలను సమర్పించారు. ఆదివారం సిరికొండ మండలం చిన్నావాల్గోట్ గ్రామంలో నూతనంగా విగ్రహాలను తయారు చేసి ప్రతిష్ఠించినందున గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఊరపోచమ్మకు బోనాలను తీసి నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు మహిళలు పెద్ద సంఖ్యల పాల్గొన్నారు.

చిన్నారి ప్రాణం తీసిన కూలర్


చిన్నారి స్నిటిక (ఫైల్)

ఆర్మూర్‌రూరల్, మే19: అప్పటి వరకు సంతోషంగా ఆడుకుంటున్న చిన్నారికి కూలర్‌షాక్ తగిలి మృతి చెందిన సంఘటన ఆర్మూర్‌లో శనివారం రాత్రి జరిగింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గంగస్థాన్ ప్రాంతానికి చెందిన వినిత్ దీపికల కూతురు స్నిటిక(7) వేసవి సెలవులు ఉండడంతో ఆర్మూర్‌లోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. తోటి స్నేహితులతో ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు చిన్నారి స్నిటిక కూలర్‌ను ముట్టుకోవడంతో కూలర్‌కు విద్యుత్ సరఫరా అయిషాక్ తగలడంతో అక్కడి కక్కడే మృతి చెందింది. కొద్దిసేపటి వరకు తమ కళ్ల ముందు ఆడుకుం టున్న చిన్నారి విద్యుత్‌షాక్ గురై మృతి చెందడంతో కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి.మృతిచెందిన చిన్నారికి నిజామాబాద్‌లో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే


సినిమాకు క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే

నిజాంసాగర్, మే 19: నిజాంసాగర్ ప్రాజెక్టును ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంత్‌రావు సందర్శించారు గోల్‌బంగ్లా, తదితర ప్రాజెక్టు పైగల కట్టడాలను ఎమ్మెల్యే స్నేహితులు, అమెరికాకు చెందిన శాస్త్రవేత్త స్టీవ్ బిల్డెడ్‌తో కలిసి సందర్శించారు. ప్రాజె క్టును పర్యాటకరంగంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉందన్నారు. ఆయన వెంట నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్, మహ్మద్‌నగర్ మండలాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కాం గ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

● వెబ్ సీరీస్‌కు క్లాప్ కొట్టినఎమ్మెల్యే

జుక్కల్ నియోజకవర్గంలో చిత్రీకరణ చేస్తున్న నివరపల్లి అనే వెబ్ సిరీస్‌కు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు క్లాప్ కొట్టారు. మెలోడ్రామా మూ వీ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌లో ప్రొడ్యూసర్ ఆర్జబ్ కుమార్, భాస్కర్ మౌర్య దర్శకత్వంలో ఈ వెబ్ సిరీస్ తెరకెక్కుతుంది. జుక్కల్ మండలం లోని గుండూర్‌లో ఎమ్మెల్యే క్లాప్ కొట్టి ప్రారంభించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోటగిరి,మే19: పొతంగల్ మండల కేంద్రంలోని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన మైనారిటీ మహిళ శనివారం రాత్రి గుండెపోటుకు గురైంది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా షేక్ అనీస్ మృతి చెందింది. బాధిత కుటుంబానికి మాజీ కోఆప్షన్ సభ్యులు ఎంఏ.అఖిమ్ 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

నిజాంసాగర్, మే 19: నిజాంసాగర్ మండల కేంద్రంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతియేటా వీరబ్రహ్మంగారి ఉత్సవాలలో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. స్థానిక, చుట్టు పక్కల మల్లయోధులతో పాటు కర్ణాటక, మహరాష్ట్రల నుంచి మల్లయోధులు విచ్చేసి పోటీల్లో తలపడ్డారన్నారు. పోటీలు తిలకించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూశామన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, సందీప్, లింగా గౌడ్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్ని ప్రమాదాలు జరగాలి

● మోస్రా బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో ● ఇబ్బందుల్లో వాహనదారులు ● పట్టించుకోని సంబంధిత అధికారులు


ప్రమాదకరంగా మారిన ఇరుకు బ్రిడ్జి రోడ్డు


బ్రిడ్జి ముందు ఏర్పడిన గుంతలు

మోస్రా,మే19: మోస్రా మండల కేంద్రం శివారులో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారి హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన రోడ్డు బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి వద్ద రెండు వైపులా రోడ్డు గుంతలు పడి ఉండడం వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బాన్సువాడ, వర్ని, నిజామాబాద్ ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ఈ బ్రిడ్జి కూడా శిథిలావస్థలో ఉంది. ఈ బ్రిడ్జి కారణంగా ఇప్పటికే చాలా మంది వాహనదారులు గాయాల పాలు కాగా కొందరు కాళ్లు, చేతులు విరిగిన సందర్భాలు ఉన్నాయి. బ్రిడ్జి ఒక వైపుగా ఉంటే ముందే మూలమలుపు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు వాహదారులకు కన్పించే అవకాశంలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా ఈ బ్రిడ్జికి మోక్షాన్ని ప్రసాదించిన సంబంధిత శాఖ అధికారులు బ్రిడ్జిని వెడల్పు పెంచి వాహనదారుల ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఆరోగ్యానికి చెరుకు రసం


కోటగిరిలో మొబైల్ చెరకు బండి

కోటగిరి,మే19: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి సహజ సిద్ధమైన పానీయాలు తాగేందుకు జనం ఆసక్తిని కనబరుస్తున్నారు. అలాంటి వాటిలో చెరుకు రసానికి ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. చెరకు రసం గతంలో ఎక్కడో ఒక చోట మాత్రమే లభించేది. ప్రస్తుతం పట్టణాలు, పల్లెల్లో గల్లీ గల్లీల్లో అందుబాటులోకి వచ్చింది. చెరకు బండిపై రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ యువత ఉపాధి పొందుతున్నారు. ఆరోగ్యంగా ఉండడంతో పౌష్టిక విలువలు ఉండడంతో చెరకు రసాన్ని తాగేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. గత రెండు రోజులు మినహా ఎండ వేమిడికి తాళలేక ప్రజలు అల్లాడిపోయారు. వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు బహిరంగ మార్కెట్‌లో చాలా పానీయాలు అందుబాటులో ఉన్నప్పటికీ చాలా మంది ప్రకృతి సిద్ధంగా లభించే చెరకు రసాన్ని తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. ఎన్నో విటమిన్లు కలిగిన ఈ రసాన్ని తాగేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

● జోరుగా చెరుకు రసాలు అమ్మకాలు

రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలు కుటుంబాలు ఈ ప్రాంతానికి వలస వచ్చాయి. జిల్లాలోకి కోటగిరి, వర్ని, బీర్కూర్, బోధన్, ఎడపల్లి, నవీపేటతో పాటు పలు ప్రాంతాలలో సీజన్‌కు తగిన విధంగా వ్యాపారాలు నిర్వహిస్తూ జీవిస్తున్నారు. ప్రత్యేకంగా మొబైల్ చెరకు రసం బండ్లను తయారు చేసి పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో తిరుగుతున్నారు. ఇళ్ల ఎదుటకే వాహనాలను తీసుకువచ్చి తాజా రసాన్ని తయారు చేసి ఇస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు, వారి పిల్లలకు రోజు ఒక గ్లాస్ చొప్పున చెరకు రసం తాగిస్తున్నారు. గ్లాస్ జ్యూస్ ధర 10, 20రూపాయల వరకు విక్రయిస్తున్నారు.

● ఉపయోగాలు బోలెడు

చెరకు రసం శరీర వేడిని తగ్గించి శక్తిని ఇస్తుంది. రక్తాన్ని శుద్ది చేయడంతో పాటుగా జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లను తొలగిస్తుంది. రసంలో క్రోమియం, మెగ్నిషియం, జింక్ వంటివి అధికంగా ఉంటాయి. శరీరంలో గ్లూకోజ్ లెవల్స్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు కామెర్లు, ఇన్‌ఫెక్షన్లను రానివ్వదు. అలసటను తగ్గించి అసయాన్ని దూరం చేస్తుంది. పిల్లల్లో తరుచుగా వచ్చే చిన్నపాటి ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. రోజు తాగితే శరీర బరువు క్రమేపి తగ్గుతుంది. అందులో ఉండే కాల్షియం ఎముకలు, కండరాలకు శక్తిని ఇస్తుంది.

ఔషధంలా పని చేస్తుంది



వేసవిలో ప్రజలకు చెరకు రసం దివ్య ఔషధంలా పని చేస్తుంది. అందులో ఉండే కాల్షియం కారణంగా ఎముకలు, దంతాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. చిన్నారులకు చెరకు రసం చాలా మంచిది. పైగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా కాపాడే ఔషధ గుణాలు ఉన్నాయి.

- గోవర్ధన్, మండల విస్తరణ అధికారి, కోటగిరి

ఈ ఏడాదైనా కళాశాల ప్రారంభమయ్యేనా?

● పేరుకే కాలేజ్ ● బోధన సిబ్బంది, విద్యార్థులు లేని దుస్థితి


మండల కేంద్రంలో ప్రారంభమైన పాఠశాల అదనపు గదులు ఇవే

నిజాంసాగర్, మే 19: నిజాంసాగర్ మండల కేంద్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు అధికార యంత్రాంగం గత ఆగస్టు మాసంలో హుటా హుటీన అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించారు. కనీసం 10 మంది కూడా అడ్మిషన్ తీసుకోలేదు. 40 మంది పిల్లలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులను నిజాంసాగర్ కాలేజీలో చేర్చారు. కళాశాలలో బోధన సిబ్బంది, విద్యార్థుల ఊసే లేకుండా పోయింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నూతనంగా నిర్మాణం చేపట్టిన తరగతి గదుల్లో కళాశాలను ప్రారంభించారు. ఈ కళాశాల నిర్వహణ పిల్లం జూనియర్ కళాశాల ప్రధానాచార్యులకు అప్పగించారు. బోధన, బోధనేతర సిబ్బందిని కూడానియమించలేదు. పేరుకే నిజాంసాగర్‌లో జూనియర్ కళాశాలగా ఉంది. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ తదితర గ్రూపులలో విద్యాభ్యాసం కొనసాగనుంది. కానీ వచ్చే విద్యా సంవత్సరం ఈ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందినినియమించి, గ్రూపుల్లో అడ్మిషన్లు తీసుకునేరా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ కళాశాల నిజాంసాగర్ మండలంలో కొనసాగితే మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే 10వ తరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు వీలు కలుగుతుంది. ఈ కళాశాల నిజాంసాగర్ మండల కేంద్రంలో ఈ విద్యా సంవత్సరం పునఃప్రారంభమైతే ఉన్నత పాఠశాలల విద్యార్థుల విద్య కొనసాగుతుంది.ఇప్పటి కైనా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కళాశాలను విద్యా సంవత్స రంలో పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలి

సిరికొండ మే 19: వరంగల్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీకి చెందిన ముగ్గురు దళనాయకులను వెంటనే విడుదల చేయాలని నిజామాబాద్ జిల్లా సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా సరిహద్దులో శనివారం అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని భాస్కర్ తీవ్రంగా ఖండించారు.అనారోగ్యానికి గురైన సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ దళనాయకులు రాజన్న,జీవన్,దేవ్ రెడ్డి చికిత్సా చేయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారని ఆయన అన్నారు. ముగ్గురు నాయకులకు ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పరుచాలని భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు.వారికి ఎలాంటి ఆపద తలపెట్టవద్దని భాస్కర్ కోరారు.

సల్లంగా చూడు పెద్దమ్మ తల్లి


మెండోరలో పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ముదిరాజ్‌లు

మెండోర, మే19: సల్లంగా చూడు పెద్దమ్మతల్లి అంటూ ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకు న్నారు. ఆదివారం మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మతల్లి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి పవిత్ర పుణ్యక్షేత్ర గోదావరి నది నుంచి గంగజలాలను తీసుకువచ్చి గంగాజలాలతో అభిషేకం చేసి అమ్మవారికి బెల్లం అన్నంతో నైవేద్యం చూపించి అమ్మవారిని దర్శించుకుని పాడి పంటలు, వ్యాపారాల్లో అధిక లాభాలు వచ్చేటట్టు కరుణ చూపాలని అమ్మవారికి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ కులస్థులు, కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పచ్చలనడ్కుడలో ఒకచోట కలిసిన 1996-97 పూర్వవిద్యార్థులు

వేల్పూర్,మే15: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో విద్య సంవత్సరం పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు 27ఏళ్ల తర్వాత ఆదివారం ఒక చోట కలుసుకొని పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగులుగా స్థిరపడిన పూర్వవిద్యార్థులు పచ్చలనడ్కుడ ప్రభుత్వ పాఠశాలకు చేరుకొని కార్యక్రమం జరుపుకున్నారు. 27ఏళ్ల తర్వాత తామందరం ఒక చోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు, ప్రస్తుత వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువ, జ్ఞాపికలతో సన్మానించుకొని ఆశీర్వదాలు తీసుకున్నారు. అంతకు ముందు వారు చదివిని పాఠశాల తరగతి గదుల వద్దకు చేరుకొని గత స్మృతులను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారందరు సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందంతో మునిగితేలారు.

ముప్కాల్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీసమ్మేళనంలో కలుసుకున్న 25ఏళ్ళ పూర్వవిద్యార్థులు


ముప్కాల్, మే19: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1998-99విద్యసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 25ఏళ్ల పూర్తి సందర్భంగా సిల్వర్ జూబ్లీని ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో, వ్యాపారాల్లో, ఉద్యోగాలలో స్థిరపడి ఒక చోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరిం చుకుంటూ యోగక్షేమాలు, పాఠశాల తరగతి గదులలో తిరుగుతూగత స్మృ తులను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యానభ్యాసించిన గురువులు ప్రధానోధ్యాయులు లక్ష్మారెడ్డి, ముత్తెన్న, లింబాన్న, తదితర ఉపాధ్యా యులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో పూర్వ విద్యార్థులు బాగ్యలక్ష్మీ, వాణి, సంధ్య, దత్తు, దిలీప్, కిరణ్, పవన్, రహీం, కిశోర్, శ్రీహరి, శ్రీకాంత్‌యాదవ్; తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


రామారెడ్డిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రామారెడ్డి,మే 19: రామారెడ్డి మండల కేంద్రంలో ఆదివారం 1991-92 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా గురువులను సన్మానించి వారికి పూలమాలతో సత్కరించారు. వారితో చదువుకున్న కొంతమంది విద్యార్థులు మృతిచెందడంతో ఒక నిమిషం మౌనంపాటించారు.32 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో అందరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనందంగా గడిపారు.

కామారెడ్డిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఒకే దగ్గర కలుసుకున్న (1998-99) బ్యాచ్ పూర్వవిద్యార్థులు

కామారెడ్డిటౌన్,మే 19: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థులు అపూర్వసమ్మేళనం నిర్వహించారు. 1998-99 విద్యాసంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు కలుసుకుని 25 సంవత్సరాల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆప్యాయంగా గడిపారు. తమకు చదువుచెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

నేటి నుంచి 60 శాతం రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ

బీర్కూర్, మే 19: వ్యవసాయ శాఖ ద్వారా బీర్కూర్, దామరంచ సహ కార సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 60 శాతం రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. బీర్కూర్ సహకార సంఘంలో 166 బస్తాలు, దామరంచ సంఘంలో 166 బస్తాల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక బస్తా (30 కేజీలు) రూ.1116 అందిస్తున్నామన్నారు. కావాల్సిన వారు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు మొబైల్ నెంబర్ అందించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 19: గిరిజన విద్యార్థుల కోసం బెస్ట్ అవలేబుల్ స్కీమ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి నాగోరావు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 21 నుంచి జూన్ 6 వరకు గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో 3, 5, 8 తరగతుల్లో గిరిజన బాల బాలికల నుండి దరఖాస్తులు స్వీకరించబడుతాయని తెలిపారు. బెస్ట్ అవలేబుల్ స్కీమ్‌లో ప్రవేశం కోసం తల్లిదండ్రుల సంవత్సరం ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి ఒకలక్షా 50వేలు, పట్టణ ప్రాంతాల వారికి 2లక్షలకు మించరాదని తెలిపారు. ఒక్క కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం కల్పించబడుతుందని అన్నారు. 3వ తరగతిలో 26 సీట్లకు గాను 17 మంది బాలురు, 9 మంది బాలికలు, 5వ తరగతిలో 13 సీట్లకు గాను 9మంది బాలురు, 4 బాలికలు, 8వ తరగతిలో 13 సీట్లకు గాను 9 మంది బాలురు, 4 బాలికలకు సీట్లు ఉన్నాయన్నారు. 3, 5, 8 తరగతిలో పి-టి-జి కులాల విద్యార్థిని విద్యార్థులకు 6 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. మిగతా వివరాల కోసం 9912086022 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఏబీవీపీ పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ముగింపు సభ



సన్మానిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, మే 19:అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని గత కొన్ని రోజులుగా నిర్వహించారు. ఆదివారం ముగింపు సభను జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, ముఖ్యవక్తగా ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు రెంజర్ల నరేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీవీపీ ఆందోళనాత్మక కార్యక్రమాలతో పాటు నిర్మాణాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొందించుకోవాలని సేవాదృక్పథంలో ఉండాలని కోరారు. ఉన్నత విద్యను అధిరోహించాలని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ఉచిత శిక్షణ ద్వారా విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అధ్యాపకులకు ఘనంగా సన్మానించారు. ఆదివారం నిర్వహించిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, ఏబీవీపీ నగర అధ్యక్షులు వెంకటకృష్ణ, జిల్లా కన్వీనర్ దామ సునీల్, పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ కన్వీనర్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నగరంలోని రావూజీ సంఘం పూర్వ విద్యార్థులు 2001-2002

నిజామాబాద్ అర్బన్, మే 19: ఇరవై నాలుగు సంవత్సరాల తర్వాత వారు ఒకరినొకరు కలుసుకున్నారు. పదవ తరగతి చదువుకున్న అనంతరం ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా సుమారు 24 సంవత్సరాల తర్వాత అందరూ ఒకచోట చేరి సందడి చేశారు. నగరంలోని నాందేవ్‌వాడ రావూజీ సంఘం ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 2001-2002 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆనాటి అధ్యాపకులు గంగాధర్, రవికుమార్, నాగభూషణం, ముత్యం రెడ్డి, మల్లయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం చాలా అభినందనీయమని అన్నారు. ఆనాటి మా విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉండటం గర్వంగా ఉందన్నారు. అనంతరం గురువులను పూర్వ విద్యార్థులు పూలమాలలతో, శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు ఆనాడు చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్పల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బ్యాచ్ (2006-2007)

దర్పల్లి, మే 19: మండల కేంద్రంలో 2006-2007 ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. గ్రామంలోగల హంసవాహిని పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఒకచోట సమావేశమై గతంలో పాఠశాల పరిణామాల గురించి గుర్తు చేసుకున్నారు. వివిధ ప్రదేశాల్లో ఉన్న 30 మంది విద్యార్థులు ఒకవేదికపై చేరి తమ కుటుంబాల నేపథ్యం గురించి పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆటా పాటలతో ఆనందంగా గడిపారు.

గిల్లిదండా ఆటతో బెట్టింగ్

- రోజు వేలల్లో నష్టపోతున్న యువకులు
- కనుమరుగవుతున్న ఆటతో బెట్టింగ్ ఆడుతున్న యువకులు
- జిల్లాతో పాటు పలు మండల కేంద్రాల్లో బెట్టింగ్



గిల్లిదాండ ఆడుతున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

సుభాష్‌నగర్, మే 19: 'గిల్లిదండా' ఈ ఆట నైంటిస్ కిడ్స్ ఆడుకునే ఆట. ఇప్పటికే ఈ ఆట గ్రామాల్లో కనుమరుగైపోయింది. పట్టణాల్లో ఈ ఆటను తెలిసిన వారు ఉండరు. ఒక పొడవాటి కట్టె, చిన్న జాన ఆకారంలోగల కట్టెతో ఆడే ఈ ఆటకు ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో క్రేజ్ పెరిగింది. ఆ ప్రాంతాల్లో దీన్ని డబ్బులు సంపాదించే ఆయుధంగా మార్చుకొని ఆటను ఆడుతున్నారు. ఓ వర్గానికి చెందిన యువకులు పొద్దస్తమానం గిల్లిదండా ఆట ఆడుతూ ఇండ్లను గుల్ల చేసుకుంటున్నారు. రోజు వేలల్లో బెట్టింగ్‌కు పాల్పడుతూ డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఈ కనుమరుగైన ఆటను జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బెట్టింగ్ ఆడుతూ యువకులు మజా పొందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ నిర్మానుష్య ప్రాంతంలో గిల్లిదండా ఆడుతూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఒక్కో ఆటకు 1000 నుంచి 20వేల చొప్పున బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రాంతంలో, జిల్లాలోని నందిపేట్, నవీపేట్ ప్రాంతాల్లో ఈ ఆటను ఆడుతూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా యువత ఈ ఆటను ఆడుతూ బెట్టింగ్ కాస్తున్నారు. దీనిపై ఎవరికి సమాచారం లేకపోవడంతో అధికారులు, పోలీసులు అటువైపు చూడటం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ఆటకావడంతో ఏదో ఆడుకుంటున్నారని వదిలేస్తున్నారు. కానీ దీని వెనుక బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనేది బయటకు పొక్కడం లేదు. డబ్బులు పోగొట్టుకున్న వాళ్లు కొందరు అక్కడ ఇక్కడ అనడంతో బయటకు పొక్కుతుంది. గిల్లిదండా బెట్టింగ్‌పై పోలీసులు ఓదృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మెడికవర్, కీర్తిసాయి ఆసుపత్రులపై
క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

పెద్దబజార్, మే 19: జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ప్రజల ప్రాణాలతో చెలగాటాలు ఆడుతున్నాయని అలాంటి ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కీర్తిసాయి ఆసుపత్రిలో నాలుగు నెలల క్రితం గర్భిణి మృతికి కారణం అంటూ మృతురాలి బంధువులు ఆందోళన చేశారని అన్నారు. అదేవిధంగా మెడికవర్ ఆసుపత్రిలో రెంజల్ మండలానికి చెందిన వ్యక్తి గుండె జబ్బుతో ఆసుపత్రిలో చేరితే డబ్బులు వసూలు చేసి అతని శవాన్ని కుటుంబ సభ్యులకు ఇచ్చారని అన్నారు. గతంలో కరోనా సమయంలో ప్రైవేటు ఆసుపత్రులపై వచ్చిన ఆరోపణలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటీసులు ఇచ్చినట్లు మీడియాలో వచ్చిందని వాటిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా లేదా ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గత కొన్ని రోజులుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బాధిత కుటుంబాలకు పౌరసమాజం అండగా ఉండాలని అన్నారు.

వీడీసీ సభ్యులపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి, మే 19: డిచ్‌పల్లి బస్టాండ్ ఆవరణలో గల స్పటిక లింగేశ్వర స్వామి ఆలయం యొక్క 235 సర్వే నంబంలో గల 30గుంటల భూమి తన పేరు మీద ఉందని కానీ ఆలయ నిర్మాణానికి వాడుకున్నరని ఈ విషయం ప్రశ్నిస్తే వీడీసీ సభ్యులు బెదిరిస్తున్నరని డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన డాక్టర్ ఆశోక్ ఆరోపించారు. ఈ విషయంపై ఆయన విలేకర్ల సమావేశం నిర్వహి ంచి వివరాలు వెల్లడించారు. తనకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎస్సారెస్పీలో తేలిన కుస్తాపూర్ మల్లన్నగుడి



ఎస్సారెస్పీ జలాశయంలో తేలిన మల్లన్నగుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముప్కాల్, మే19: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ముంపు గ్రామం కుస్తాపూర్ మల్లన్న గుడి తేలింది. ఐదేళ్ల తర్వాత ప్రాజెక్టు నీటి మట్టం డెడ్‌స్టోరేజీకు చేరడంతో కుస్తాపూర్ మల్లన్న బయటప డింది. దీంతో చుట్టు పక్కల గ్రా మాల భక్తులు తరలివచ్చి పూజ లు చేస్తున్నారు. బాల్కొండ మండలం నాగాపూర్, బస్సాపూర్ గ్రామాల ఆరాధ్యదైవంకు కుస్తాపూర్ మల్లన్న ప్రాజెక్టు నిర్మాణంలో ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల 91గ్రామాలు ముంపుకు గురయ్యాయి. ఇప్పటి ప్రభుత్వం ముంపు గ్రామాలకు ధర్మపురి, జగిత్యాల్, మెట్‌పల్లి ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చింది. కొందరు బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో స్థిరపడ్డారు. ప్రాజెక్టు నీరు తగ్గితే మల్లన్న ఆలయంతో పాటు మరో శివాలయం బయటపడుతుంది. నీటిమట్టం తగ్గడంతో ముంపు గ్రామాలు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు గుట్టపై ఉన్న మల్లన్నను దర్శించుకునేందుకు వెళ్తున్నారు. మొన్నటి వరకు మల్లన్నగుడి వద్దకు వెళ్ళే మార్గంలో నీరు ఉండడంతో కాలినకడన వెళ్ళి పూజలు చేశారు. ఇప్పుడు నీరు తగ్గుముఖం పట్టగా ఆలయం వరకు వాహనాలు వెళ్తున్నాయి. మల్లన్నకు ఆదివారం ప్రీతికమైన రోజు కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లిస్తున్నారు.

అంగన్‌వాడీ అద్దె భవనాలు.. అరకొర వసతులు

- కనీస సౌకర్యాలు లేక చిన్నారుల ఇబ్బందులు
- సొంత భవనాలు ఉన్న చోట విద్యుత్ కనెక్షన్‌ల కరువు



అంగన్‌వాడీ పాఠశాల దృశ్యం

బోధన్‌రూరల్,మే19: గ్రామీణ ప్రాంతాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంతో పాటు బాలింతలు, గర్భిణీలు, చిన్న పిల్లలకు పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ సెంటర్లు ప్రస్తుతం సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలు అమలు చేసినా క్షేత్రస్థాయిలో అసౌకర్యాలు వెంటాడుతున్నాయి.

● అంగన్‌వాడీ సేవలు

పోషక్ అభియాన్, ఆరోగ్య లక్ష్మి అనుబంధ పోషకాహారం వంటి సేవలు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అమలు అవుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గ్రామాలలో 0నుంచి 6ఏండ్ల లోపు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడం, మహిళలకు ఆరోగ్యకరమైన సలహాలు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడానికి కృషి చేస్తున్నారు. సెంటర్లలో సామాజిక అక్షరాభ్యాసాలు, శ్రీమంతాలు నిర్వహిస్తూ అటు పిల్లలకు, ఇటు గర్భిణులకు చేయూత అందిస్తున్నారు.

● సొంత భవనాలు కరువు

బోధన్ డివిజన్‌లో మొత్తం 331అంగన్‌వాడీ సెంటర్‌లు ఉన్నాయి. వీటిలో 167అంగన్‌వాడీ సెంటర్‌లకు సొంత భవనాలు ఉన్నాయి. 76అద్దె భవనాలు ఉన్నాయి. అద్దె లేని అంగన్‌వాడీ కేంద్రాలు 88ఉన్నాయి. అద్దె భవనాలు తప్ప అక్కడక్కడ అంగన్‌వాడీ సెంటర్‌లో పూర్తి స్థాయి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఫ్యాన్లు లేక చిన్న పిల్లలు ఉక్కపోతకు గురవుతున్నారు. చాలా అంగన్‌వాడీ సెంటర్‌లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతి లేక బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు, సొంత భవనాలు 167ఉన్నా అందులో కొన్ని సెంటర్ అసంపూర్తిగా సైతం ఉన్నాయి. కొన్ని సెంటర్‌లలో మరుగుదొడ్లు నిర్మించడం లేదు. పూర్తిస్థాయి నీటి వసతి లేకపోవడంతో వృథా మారాయి.

● ఖాళీ అంగన్‌వాడీ పోస్టులు

బోధన్ డివిజన్‌లో 12అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలు అంగన్‌వాడీ కేంద్రాలలో 63ఆయా పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయని బోధన్ సీడీపీవో జానకి తెలిపారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. ఆగిపోయిన సెంటర్‌ల నిర్మాణం పూర్తి చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

అంగన్‌వాడీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం



బోధన్ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తాం, ఖాళీగా ఉన్న పోస్టులను ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తి చేస్తామన్నారు.

- జానకి, ఐసీడీఎస్, సీడీపీవో, బోధన్

నవీపేట జామ మసీదు కమిటీ ఎన్నిక

నవీపేట,మే19: నవీపేట జామ మసీదు కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్‌కే.మొహిజ్, ఉపాధ్యక్షులు అతిక్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ సద్దాం, కార్యదర్శిగా ఫసిమొద్దీన్, సభ్యులుగా ఫిర్దోజ్, లతీఫ్, షంషోద్దీన్‌లను ఎన్నుకున్నారు.

● ఈద్గా కమిటీ ఎన్నిక

ఈద్గా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్‌కే.అప్సర్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే.ఆసిఫ్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.యుసుఫ్, కార్యదర్శులుగా ఫసిమొద్దీన్, ఇమ్రాన్, సభ్యులుగా సాబేర్, నజీబ్, జబీర్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జక్రాన్‌పల్లి, మే19: మండలంలోని జక్రాన్‌పల్లిలో ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో ఆసక్తి గల విద్యార్థులు ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 25తేదీలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.


మున్సిపల్ కార్యాలయంలో ప్రధాన పోస్టులు ఖాళీ



మున్సిపల్ కార్యాలయం

ఆర్మూర్‌టౌన్ , మే19: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలు అయోమయా నికి గురవుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారిగా చంద్ర శేఖర్ గత మూడేళ్ల క్రితం నియామకం కావడంతో సంగారెడ్డిలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. ఆయన స్థానంలో నిర్మల్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన హరిష్ గత రెండు నెలలుగా సెలవులో ఉండడంతో గృహ, వ్యాపార, నిర్మాణం చేసుకునే ప్రజలు కార్యాలయం చుట్టు తిరుగుతూ వెళ్ళిపోతున్నారు. టీపీఎస్ రెండు పోస్టులలో ఒకరు నిజామాబాద్ నుంచి డిప్యూటేషన్‌గా రాగా సోమ,మంగళ వారాల్లో ఆర్మూర్‌లో అందు బాటులో ఉం టున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీపీపీఓలుగా నలుగురు ఉండాల్సింది ఒక్కరు కూడా లేరు. సీనియర్ అసిస్టెంట్ లు ముగ్గురు పోస్టింగ్ కేటాయించగా వారు డిప్యూటేషన్‌పై వెళ్లారు. హెల్త్‌అసిస్టెంట్‌లు ఇద్దరు ఉండాల్సింది ఒక్కరే ఉండడంతో ప్రధాన పోస్టుల్లో ఖాళీలు ప్రజలు తమ పనులను చేసుకోవడానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. కార్యాలయంలోని ప్రధాన పోస్టులను భర్తీ చేయాలని పట్టణ ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారిని నియామించాలి



మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారిని నియామించి అక్రమ కట్టడాలుజరుగకుండా తగు చర్యలు చేప ట్టాలి. అలాగే ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలి.

- జీవీ.నర్సింహరెడ్డి, బీజేపీ ఫ్లోర్‌లీడర్

యువత క్రీడాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే19: యువత క్రీడాల్లో రాణించాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో ప్రీమియర్ లీజ్ క్రికెట్ సీజన్-1 ఫైనాల్ చాలెంజర్స్‌లో గెలుపొందిన ఐలాపూర్ క్రికెట్ జట్టుకు 25,555రూపాయల నగదును అందజేశారు. రన్నర్‌గా రాణించిన పెగడాపల్లి క్రికెట్ టీమ్‌కు 12,255 రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత క్రీడాల్లో రాణించాలని, క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రికెట్ పోటీలలో గెలుపొందిన వారికి నగదును అందజేసిన సార్గం రాధిక పోతారెడ్డి, సొసైటి చైర్మన్ రాజారెడ్డిలను అబినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌లక్ష్మారెడ్డి, దొడ్ల రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ జయశ్రీ భూంరెడ్డి, గ్రామస్థులు సుదర్శన్, కృష్ణారెడ్డి,రవి, నాగరాజులతో గ్రామస్థులు తదితరులున్నారు.

21న జీలుగ విత్తనాల పంపిణీ

నవీపేట,మే19: నవీపేట సొసైటీలో ఈ నెల 21 మంగళవారం రోజున రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని సొసైటీ కార్యదర్శి మహేష్ తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లను ఏఈవోకు అందజేసి విత్తనాలను పొందాలని ఆయన కోరారు. నవీపేట సొసైటీకి 30కిలోల బరువు ఉన్న 250బస్తాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఒక్కొ బస్తాను సబ్సిడీపై రూ.1,116 ధరకు అందజేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

వాసవీ కపుల్స్ క్లబ్ కార్యవర్గం ఏర్పాటు



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ధర్పల్లి, మే 19: ధర్పల్లి మండల వాసవీ కపుల్స్ క్లబ్ కార్యవర్గాన్నిఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కోటగిరి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా దొంతుల రాకేశ్, ట్రెజరర్‌గా లాబిశెట్టి మధుకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికైన కార్యవర్గం ఏడాది పాటు కొనసాగుతుంది. మండలంలో వాసవీ కపుల్స్ క్లబ్‌ను అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గం తెలిపింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ సుదర్శన్‌గుప్త, గుడిపల్లి రమేష్, విశ్వనాథం శ్రీనివాస్,బొంపల్లిరాజు, మండల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మోకన్‌పల్లిలో బెల్టు షాపులపై దాడి

నవీపేట,మే19: మండలంలోని మోకన్‌పల్లిలో శనివారం రాత్రి రెండు బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, నవీపేట పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడి చేయడం జరిగిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన నర్సాగౌడ్ వద్ద 32బీర్లు, శ్రీనివాస్ గౌడ్ వద్ద 10బీర్లు, 6క్వార్టర్స్ మద్యం సీసాలను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరు బెల్టు షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

డిచ్‌పల్లిలో పెద్దమ్మతల్లికి బోనాలు

డిచ్‌పల్లి, మే 19:మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లికి గ్రామస్థులు పెద్ద ఎత్తున బోనాలు తీసి అమ్మ వారికి సమర్పించారు. పలురకాల వంటకాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపు వేడుకల్లో మహిళలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు




రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు



బిస్కెట్(10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,200	రూ.67,500	రూ.875

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కృష్ణమ్మ (1.20, 7.25)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (4.15)
: అపరిచితుడు (10.20)
స్క్రీన్-2 : ది ఘర్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లీష్ 3డి) (12.00, 2.25, 4.50, 7.15, 9.40)
స్క్రీన్-3 : కర్గమ్ భుగ్గం (హిందీ) (1.10)
: ఆ ఒక్కటి అడక్కు (4.05)
: శ్రీకాంత్ (హిందీ) (7.00, 10.00)
స్క్రీన్-4 : నటరత్నాలు (12.10)
: దర్శిని (2.50)
: మిరల్ (5.30, 10.30)
: అక్కడ వారు ఇక్కడ ఉన్నారు (8.05)
స్క్రీన్-2 : ఆ ఒక్కటి అడక్కు (10.50, 1.40, 7.30, 10.30)
: ది ఘర్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లీష్) (4.30)
స్క్రీన్-3 : మిరల్ (1.50)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.40, 10.30)
: బాక్ (7.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: అపరిచితుడు (1.30, 7.30)
స్క్రీన్-2 : ఆ ఒక్కటి అడక్కు (10.50, 1.40, 7.30, 10.30)
: ది ఘర్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లీష్) (4.30)
స్క్రీన్-3 : మిరల్ (1.50)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.40, 10.30)
: బాక్ (7.30)



- నిజామాబాద్ అర్బన్